క్లుప్తంగా

నామమాత్రంగా మండల సమావేశం

రేణిగుంట: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం నామమాత్రంగా చేపట్టారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాలులో ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ఎలాంటి తీర్మానాలు లేకుండా కాసేపటికే ముగించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీడీఓ హరిబాబు కో–ఆప్షన్ సభ్యులు సుభాన్‌రాజా, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ నాయక్

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ నాయక్ తెలిపారు. ఆయన ఆదివారం చిన్న సింగమాల సమీపంలోని పూతలపట్టు– నాయుడుపేట జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రేణిగుంట నుంచి నాయుడుపేట వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయని, ఎటువంటి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ శివకుమార్, ట్రాఫిక్ కానిస్టేబుల్స్ బాలాజీ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పచ్చాలమ్మకు విశేష పూజలు



పూజలు చేస్తున్న పూజారి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలోని పచ్చాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు విశేష పూజలు చేశారు. అమ్మవారి విగ్రహానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

శ్మశానానికి దారి కల్పించండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వెస్టువరత్తూరులో శ్మశానానికి దారి వసతి కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. శ్మశానం గ్రామానికి ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉండడంతో శవాన్ని తీసుకుపోవటానికి నానా అవస్థలు పడుతున్నామన్నారు. దారి మొత్తం ముళ్ల పొదలతో మూసుకుపోవడంతో మృతదేహాలను తీసుకువెళ్ల లేక పోతుమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దారిలోని ముళ్లపొదలను తొలగించాలని పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి శ్మశానానికి దారిని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

8న మహతిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

తిరుపతి అలిపిరి: మహతి కళాక్షేత్రంలో ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించనున్నట్టు టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా రాయలచెరువుకు చెందిన శక్తి పీఠాధీశ్వరి మాతాజీ రమ్యానందభారతి, రేణిగుంట ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చర్ క్లస్టర్ సీఈవో గౌతమి, సీఐడీ ఎస్పీ సరిత ప్రసంగిస్తారని పేర్కొంది. ఎర్రావారిపాళెంకు చెందిన అంతర్జాతీయ హాకీ క్రీడాకారిణి రజనీ, జాతీయ ఉత్తమ మహిళా రైతు పురస్కారాన్ని గెలుచుకున్న ప్రకృతి వ్యవసాయ రైతు ఓబులమ్మ, ప్రముఖ పారిశ్రామికవేత్త, రత్న గ్రూపు సంస్థల చైర్ పర్సన్ రత్నారెడ్డిని సన్మానిస్తామని వెల్లడించింది. అదేవిధంగా పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల రూపశిల్పి డాక్టర్ కె.రాజేశ్వరి మూర్తి(101)కి 'శ్రీ పద్మావతి విద్యా ప్రకాశిని' అవార్డు ప్రదానం చేయనున్నట్టు తెలిపింది. ఆమె 1954 నుంచి 1974 వరకు శ్రీ పద్మావతి కళాశాల ఉన్నతికి విశేషంగా కృషి చేశారు. తన ఆస్తిని కూడా కళాశాలకు దానం చేశారు. టీటీడీ సంక్షేమ విభాగం డెప్యూటీ ఈవో స్నేహలత కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

తడ: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చెన్నై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్‌ఐ జేపీ శ్రీనివాస రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 1న కాదలూరు గ్రామంలో మృతిచెందిన హోం గార్డు అంత్యక్రియలకు సూళ్లూరుపేట మండలం జంగాలగుంట గ్రామానికి చెందిన తిన్నలూరి శేఖర్ వెళ్లాడు. టిఫిన్ తినేందుకు మరో వ్యక్తి బైక్ వెనుక కూర్చుని జాతీయ రహదారికి చేరుకున్న సమయంలో అదేమార్గంలో వచ్చిన మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ శేఖర్‌ని చెన్నై జీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శేఖర్ మృతిచెందాడు.

ఎన్నికల్లో విజయానికి సమష్టి కృషి అవసరం

- ఎమ్మెల్యే ఆదిమూలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి విజయానికి ప్రతీ పంచాయతీలోని నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి అవసరమని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదిమూలం మండ లంలోని అన్నీ పంచాయతీల నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోని పట్టభద్రులకు శ్యామ్ ప్రసాద్‌రెడ్డి బ్యాలెట్ నమూనా పత్రాలతో ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. జగన్ మోహన్‌రెడ్డి పథకాలు, పరిపాలనపై ప్రతి ఒక్కరూ సంతృప్తిగా ఉన్నారని ఎమ్మెల్యే అన్నారు. బ్యాలెట్ నమూనా, ఓటు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సత్యవేడు నియోజకవర్గంలో పేర్నాటికి భారీ మెజారిటీ అందించాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి బ్యాలెట్ నమూనా కరపత్రాలు, క్యాలెండర్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సత్యవేడు నియోజకవర్గ పరిశీలకులు గూడూరు రమణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, జెడ్పీటీసీ సభ్యుడు మూర్తి మునెమ్మ, నాయకులు నందకుమార్, మూర్తి సుబ్బన్న, సర్పంచ్‌ల సంఘం వరదయ్యపాళెం మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, అద్దూరు సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, పట్టాభిరెడ్డి, గాలి దయాకర్‌నాయుడు, శాస్త్రిరాజు పాల్గొన్నారు.

పేర్నాటి, పర్వతరెడ్డిని గెలిపించాలి

బుచ్చినాయుడుకండ్రిగ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌ని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి కోరారు. ఆయన ఆదివారం నీర్పాకోట, గాజులపెళ్లూరు, కంచనపుత్తూరు, కారణి, కల్లివెట్టు, తలారివెట్టు గ్రామాల్లో స్థానికంగా ఉన్న గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయుల వద్దకు వెళ్లి కరప్రతాలు పంచుతూ, వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులకు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల గోపాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ గురవయ్య, నాయకులు సుందర్‌రెడ్డి, మునస్వామి, భాస్కరయ్య, హరిగోపాల్‌రెడ్డి, యూత్ లీడర్ మునిరాజా, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం

మండలకేంద్రంలోని మార్కెట్ యార్డులో సోమవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్సీ ఎన్నికలపై స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అరణివిద్యానాథరెడ్డి తెలిపారు.

శ్యామ్‌ప్రసాద్ రెడ్డికి మద్దతుగా ప్రచారం

పిచ్చాటూరు: వైఎస్సార్ సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డికి మద్దతుగా నాగలాపురం మండలంలోని కృష్ణాపురం, కాళంజేరి గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఆదివారం ప్రచారం నిర్వహించాయి. పార్టీ ఆదేశాల మేరకు పట్టభద్రులను గుర్తించి వారి ఇళ్ల వద్దకు వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటును పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డికి వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఓటర్లకు కరపత్రాలు అందిస్తూ పట్టణంలో ఎన్నికల ప్రచారం సాగించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అపరంజి రాజు, సచివాలయ మండల కన్వీనర్ మోహన్ మొదలియార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

శ్రీకాళహస్తి రూరల్: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన పేర్నాటి శ్యామ్ ప్రాద్‌రెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తిరుపతి జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు దాసా సుబ్రమణ్యం కోరారు. ఆయన ఆదివారం అక్కుర్తి, అక్కుర్తి ఎస్టీకాలనీ, బీవీపురం ఎస్టీకాలనీ, మేలచ్చూరు ఎస్టీకాలనీల్లో ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ 13న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయని అన్నారు. మండలంలోని పట్టభద్రులకు శ్రీకాళహస్తి పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారని చెప్పారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, పట్టభద్రులు ఓటింగ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పార్టీ గుర్తులు ఉండవని, పేరు మాత్రమే ఉంటుందని, దానికి ఎదురుగా ఒకటి అనే సంఖ్యను మాత్రమే వేయాలన్నారు. ఎస్‌సీసెల్ నాయకులు ప్రభాకర్, సర్పంచ్ కృష్ణయ్య పాల్గొన్నారు.

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని సచివాలయాల కన్వీనర్ల మండల ఇన్‌చార్జి (జేసీఎస్) భక్తవత్సలం కోరారు. ఆయన ఆదివారం కంచనపల్లి, బోనుపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ కోవి చంద్రయ్యనాయుడు, శ్రీరాములురెడ్డి, సచివాలయ కన్వీనర్లు మోహన్, గిరి, బోనుపల్లి సిద్దయ్య, ఎంపీటీసీ రవీంద్రనాయుడు, వీరయ్య, భక్తవత్సలం నాయుడు, జయరామయ్య, గంగయ్య, నాగూర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

రేణిగుంట: ఈ నెల 13న జరుగనున్న తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎన్నికలలో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ కోరారు. ఆయన ఆదివారం రేణిగుంట పట్టణం, వడ్డిమిట్ట, వేణుగోపాలపురం, పాంచాలినగర్‌లో ప్రచారం జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి పేర్నాటిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు నగేశం, ఇర్ఫాన్, రమేష్, వైస్ ఎంపీపీ సుజాత, కో–ఆప్షన్ సభ్యులు సుభాన్ రాజా, రమణ, అమానుల్లా, అబ్దుల్ ఖాదర్, కృష్ణమూర్తి, రమణ, మహబూబాబాద్ బాషా, బుజ్జమ్మ, సాయి తదితరులు పాల్గొన్నారు.



బీఎన్‌కండ్రిగ: కల్లివెట్టులో ప్రచారం చేస్తున్న నాయకులు



కృష్ణాపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



అక్కుర్తి ఎస్టీ కాలనీలో ప్రచారం చేస్తున్న దాసా సుబ్రమణ్యం



బోనుపల్లిలో ప్రచారం చేస్తున్న భక్తవత్సలం



రేణిగుంటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఎమ్మెల్యే బియ్యపు కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు తగదు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కాపు నాయకులు

శ్రీకాళహస్తి: కాపులకు అండగా ఉండి సంక్షేమానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ కాపు విభాగం నాయకుడు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పగడాల రాజు, ఉత్తరాది శరవణకుమార్, పాండు, సురేష్, పళ్లికుప్పం శేఖర్, మున్నా, మనోహర్, వెంకటేశ్వర్లు హెచ్చరించారు. వారు ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి భిక్షతోనే కొట్టెడి మధుశేఖర్ ఆరేళ్ల పాటు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడిగా పనిచేశారని తెలిపారు. 2019 ఎన్నికలకు 20 రోజుల ముందు అప్పటి అధికార పార్టీ టీడీపీకి అమ్ముడుపోయారని ఆరోపించారు. కాపుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని, మిద్దెల హరిని విమర్శించే స్థాయి కొట్టెడి మధుకు లేదన్నారు. కొట్టెడి మధుశేఖర్ తీరుమార్చుకోవాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఎమ్మెల్యే పరామర్శ



వేణునాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం: మండలంలోని కళత్తూరు, పెరిందేశం గ్రామాల్లో అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పరామ ర్శించారు. కళత్తూరులోని గినెయ్య, పెరిందేశంలో గోవిందయ్య, వేణునాయుడు లు గత వారం అనారోగ్యంతో మృతి చెందారు. పార్టీ ఆవిర్భం నుంచి పార్టీకి సేవలందించిన కార్యకర్తల చిత్రపటాలకు ఎమ్మెల్యే నివాళులర్పించారు. అలాగే పెరిందేశంలోని అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నేత సుబ్బరామనాయుడిని ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గ వర్ల కృష్ణయ్య, నందకుమార్, స్థానిక నాయకులు నందకుమార్, వెంకటేశ్వర్లు, మాధవయ్య, నాగేష్, బత్తెయ్య, కర్ణం బత్తెయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల కోసం విద్యార్థుల నిరీక్షణ



బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు, అరిగిలకండ్రిగ, వీఎస్ పురం, పద్మావతిపురం, పదో మైలు గ్రామాల నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సుల కోసం గంటల కొద్ది నిరీక్షించాల్సి వస్తోందని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామాల నుంచి బుచ్చినాయుడుకండ్రిగ, పల్లమాలలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలకు రోజుకు 70 మంది విదార్థులు బస్సుల్లో వెళ్తుతుంటారు. బస్సులు సకాలంలో రాక పోవడంతో పాఠశాలకు సమయానికి వెళ్లలేక పోతున్నారు. బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సివస్తోంది. ఇప్పటికైన ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులను సమయానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

7న కల్కి భగవాన్ జన్మదిన వేడుకలు



ఏకం ఆలయ ప్రాంగణంలో కల్కి భగావన్ జన్మదిన వేడుకలకు సిద్ధమవుతున్న సభావేదిక

వరదయ్యపాళెం: ప్రముఖ ఆధ్యాత్మిక గురువు కల్కి భగవాన్ జన్మదిన వేడుకలు ఈ నెల 7వ తేదీన మండలంలోని బత్తలవల్లంలో ఉన్న ఏకం ఆలయంలో జరగనున్నాయి. 50 వేల మందికి పైగా భక్తులు భగవాన్ జన్మదిన వేడుకలకు తరలి రానుండడంతో ఏకం ఆలయ ప్రాంగణంలో భారీ సభావేదికను ఏర్పాటు చేస్తున్నారు. ఆశ్రమ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. దేశం నలుమూలల భగవాన్‌కు భక్తులు ఉన్న నేపథ్యంలో సినీ, రాజకీయ, వ్యాపార, వివిధ హోదాల్లో ఉన్న అధికారులు జన్మదిన వేడుకలకు రానున్నారు. ఈ నెల 7వ తేదీ రాత్రి 7 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు భగవాన్ జన్మదిన వేడుకలు జరగనున్నాయి.

వరల్డ్ ఒన్నెస్ డేగా నామకరణం

ఏకం ఆలయంలో ఈ నెల 7వ తేదీన జరిగే భగవాన్ జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని లోకా ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ, ట్రస్టు ప్రతినిధి ఉమాపతి దాసాజీ పిలుపునిచ్చారు. భగవాన్ జన్మదినానికి వరల్డ్ ఒన్నెస్ డేగా నామకరణం చేసినట్లు వారు తెలిపారు. ఈ వేడుకల్లో అమ్మాభగవాన్ల ఆధ్యాత్మిక సందేశం, వారి తనయుడు కృష్ణాజీ, ప్రీతాజీ దంపతుల ప్రసంగాలు, యోగా వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఏకకాలంలో భగవాన్ భక్తులకు అనుగ్రహ దీక్ష చేపడుతున్నట్లు పేర్కొన్నారు. భారీ ఎత్తున భక్తులు తరలి రానుండడంతో అన్నిరకాల ఏర్పాట్లు చేపడుతున్నట్లు చెప్పారు.

ఘనంగా రాజరాజేశ్వరి బ్రహ్మోత్సవాలు

గూడూరు: పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ రోడ్డు ప్రాంతంలో వెలసియున్న రాజరాజేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం చండీ హోమం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు వెండి చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



రామాపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ అజయ్‌కుమార్

శ్రీకాళహస్తి రూరల్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ హెచ్చరించారు. ఆయన ఆదివారం రామాపురం, వేడాం, అబ్బాబట్లపల్లిలో ప్రజలతో మాట్లాడారు. కోడి పందేలు, పేకాట, సారా తయారీ చట్టరీత్యా నేరమని తెలిపారు. ఎవరైనా కోడి పందేలు, పేకాట ఆడినా, సారా తయారు చేసినా తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు తీసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. గ్రామాల్లోకి గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తుంటే 9440900722కి సమాచారం అందించాలని తెలిపారు. భూ సమస్యలు, చిన్నచిన్న తగాదాలను గ్రామాల్లోనే పరిష్కరించుకోవాలన్నారు.

పాఠశాలకు స్థలం కేటాయింపు

సత్యవేడు: పెద్ద ఈటిపాకం పంచాయతీలోని రాచపాళేనికి నూతనంగా మంజూరైన ప్రాథమిక పాఠశాలకు 0.7 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం కేటాయించారని ఎంఈఓ రవి తెలిపారు. రాచపాళెంలో నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యకమంలో స్థానికులు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను గ్రామంలో ప్రాథమిక పాఠశాల లేక పిల్లలు రెండు కిలో మీటర్లు దూరంలోని చిన్న ఈటిపాకం పోయి వస్తున్నారని, రోడ్డు మార్గంలో వాహనాలు రాకపోకల అధికంగా ఉండడంతో విద్యార్థులకు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. పాఠశాల మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జిల్లా అధికారులతో సంప్రదించి రాచపాళేనికి కొత్తగా ప్రాథమిక పాఠశాల మంజూరు చేయించారు. దీంతో సర్పంచ్ రూబెన్, గ్రామస్తులు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. కొత్త భవనం ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నట్లు ఎంఈఓ తెలిపారు.

శిల్పారామంలో 8న హోలి సంబరాలు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో 8న హోలి సంబరాలను నిర్వహించనున్నట్టు ఏఓ ఖాదర్‌వలి తెలిపారు. ఆయన ఆదివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతిలోని లండన్ బ్యూతోరియం , బైడల్ మేకప్ ఆర్థిక సాయంతో హోలి పండుగ వేడుకలు నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. ఇందులో వయసుతో సంబంధం లేకుండా అందరికీ ఆహ్లాదం కలిగించేలా డీజే మ్యూజిక్, రెయిన్ డ్యాన్స్, తీన్మార్ బాండ్, హైదరాబాద్‌కు చెందిన డీజే మాస్టర్‌తో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రసాయనాలు వినియోగించని రంగుల ద్వారా నిర్వహించే హోలి పండుగలో అందరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. హోలి పండుగకు సంబంధించిన టికెట్లు కావాల్సిన వారు 8328132915, 905267090లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రియ సందీప్, హరి, శ్రీధర్, నందా సందీప్ పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఓ ఖాదర్‌వలి

కండలేరులో 43.978 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 43.978 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 1,210 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు100, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిజ్‌కు 50, హైలెవల్ స్లూయిజ్‌కు 140 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



బ్యాడ్మింటన్ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

పుత్తూరు రూరల్: సమాజాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని పుత్తూరు తపాలా శాఖ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ నరసింహప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎస్ఆర్ఎస్ కళాశాల గ్రౌండ్‌లో పోస్టల్ మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. పనిభారంతో కలిగే మానసిక ఒత్తిడిని జయించడానికి క్రీడలు అవసరమని తెలిపారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

టోర్నమెంట్ విజేత సూళ్లూరుపేట



నాయుడుపేటటౌన్: దక్షిణ రైల్వే ఉద్యోగుల ఫ్రెండ్‌షిప్ క్రికెట్ టోర్నమెంట్‌లో సూళ్లూరుపేటకు చెందిన రైల్వే సోల్జర్స్ జట్టు విజేతగా నిలిచింది. శని, ఆదివారాలు రెండు రోజులపాటు స్థానిక ఏఎల్‌సీఎం మైదానం ఆవరణలో క్రికెట్ పోటీలు జరిగాయి. దక్షిణ రైల్వే డివిజన్ పరిధిలోని పొన్నేరి నుంచి గూడూరు రైల్వేస్టేషన్‌ల వరకు రైల్వే ఉద్యోగులు 10 జట్లుగా ఫ్రెండ్‌షిఫ్ టోర్నమెంట్‌లో తలపడ్డాయి. టోర్నమెంట్స్ చైర్మన్ సూళ్లూరుపేట రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అలెగ్జాండర్ సారథ్యంలో పోటీలను నిర్వహించారు. విజేతలకు నగదుతో పాటు ట్రోఫీలను అలెగ్జాండర్‌తో పాటు దక్షిణ రైల్వే ఎస్ఎంఆర్‌లు రంజిత్‌కుమార్, ట్రోఫీకాలమ్, ఎస్ఎస్ఈ కే కృష్ణమూర్తి, రిటైర్డ్ ఎస్ఎం కే రమణయ్య, కిరణ్‌కుమార్ రైల్వే అధికారుల చేతులమీదుగా బహుమతులను అందించారు. క్రికెట్ పోటీలను తిలకించేందుకు వారి కుటుంబసభ్యులతో పాటు క్రీడాభిమానులు హాజరై సందడి చేశారు.

కనులపండువగా వేణుగోపాలస్వామి ఉత్సవం



సంతాన వేణుగోపాలస్వామి ఊరేగింపు

గంగాధరనెల్లూరు: మండలంలోని మహదేవ మంగళం సమీపంలోని సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో 47వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గోపూజ చేశారు. గోమాతను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రుక్మిణిసత్యభామ సమేత వేణుగోపాలస్వామి మూలవర్లకు పాలు, పెరుగు, తేనె, పంచామృతం నారికేళజలాలతో అభిషేకాలు చేశారు. సుగంధభరిత పుష్పాలతో విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయం నుంచి ఉత్సమూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి విశేషాలంకరణ చేసి, శాస్త్రోక్తంగా హోమం చేశారు. మంగళవాయిద్యాల నడుమ కనులపండువగా కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం పుష్పపల్లకిలో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొ న్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి ఊంజల్‌సేవ నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అనేకమంది భక్తులు పాల్గొని, మొక్కులు తీర్చుకున్నారు.

రెండెకరాల చెరుకుతోట దగ్ధం

నగరి (విజయపురం): షార్టు సర్క్యూట్‌తో రెండు ఎకరాల చెరుకు తోట దగ్ధమైన సంఘటన విజయ పురం మండలంలోని పాతార్కాడులో ఆదివారం చోటుచేసుకుంది. ఇరుగు పొరుగు రైతులు అగ్నిమాపక వాహనానికి సమాచారం అందజేయగా అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొనేసరికి రెండెకరాల తోట కాలిపోయింది. కోతకు సిద్ధంగా ఉన్న దశలో అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడంతో తన కష్టం బుగ్గి అయ్యిందని కౌలు రైతు బాలసుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.